
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



సోమశిలలో 49.195 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 49.195 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 50, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 10 వేలు క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.75,440
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,830
3 శాతం జీఎస్టీతో	రూ.7,035
నవర (8గ్రా)	రూ.56,280

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.0 /28.8

జిల్లాలో శనివారం వాతావరణం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం గాలిలో తేమ 43 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

మాజీ ఎంపీ మేకపాటి రూ.25 లక్షల సాయం



మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): విజయవాడ వరద బాధితులకు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తన వంతుగా కేఎంసీ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ తరఫున రూ.25 లక్షలు ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు చెక్కును శుక్రవారం ఏపీ సీఎం చంద్రబాబుకు పంపించారు. మేకపాటి మాట్లాడుతూ వరదల్లో చిక్కుకుపోయిన బాధితులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఉదారంగా సహాయాన్ని అందించాలన్నారు. వరదల కారణంగా మరణాలు సంభవించడం దురదృష్టకరమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ప్రాంతాలతో పాటు ప్రధానంగా విజయవాడ చుట్టు పక్కల ప్రాంతాలను వరదలు ప్రభావితం చేయడంతో భయాందోళనకు గురయ్యానన్నారు.

15న పశుసంవర్ధక శాఖ డిపార్ట్‌మెంటల్ పరీక్ష

నెల్లూరు(సెంట్రల్): ఈ నెల 15వ తేదీన ఆదివారం పశుసంవర్ధక శాఖ సహాయకులకు డిపార్ట్‌మెంటల్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్ శుక్రవారం పేర్కొన్నారు. జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న 72 మంది గ్రామ సహాయకులకు ప్రొబేషన్ డిక్లరేషన్‌తో పాటు సర్వీస్ రెగ్యులరేషన్ కోసం ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పరీక్షను నెల్లూరులోని డీకే మహిళా కళాశాలలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఈ పరీక్ష ఉంటుందని తెలియజేశారు.

రిజిస్ట్రేషన్ శాఖలో ముగ్గురు అధికారులపై వేటు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు రిజిస్ట్రేషన్‌శాఖ కార్యాలయంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఉన్నతాధికారులు కన్నెర్ర చేశారు. కార్పొరేషన్ పరిధిలో నిషేధిత జాబితాలోని 312/4 సర్వే నంబర్‌లో ఉన్న విలువైన భూమిని నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసిన విషయాన్ని శుక్రవారం 'రిజిస్ట్రేషన్లలో నయా దందా' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనానికి స్పందించిన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ శేషగిరిబాబు విచారణకు ఆదేశించారు. రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ కిరణ్‌కుమార్ జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులను విచారణాధికారిగా నియమించారు. ఆయనిచ్చిన నివేదిక ఆధారంగా అక్రమ రిజిస్ట్రేషన్ చేయడంలో కీలకపాత్ర పోషించిన నెల్లూరు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇన్‌చార్జి జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్ జాఫర్, స్టోన్‌హౌస్‌పేట ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ మిల్కిరోషన్, ఆర్వో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సింహాద్రిలను సస్పెండ్ చేసినట్లు డీఐజీ కిరణ్‌కుమార్ తెలిపారు.

రైతులకు అందుబాటులో ఉంచాలి

నెల్లూరు(బారకాసు): కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని రైతులకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని ప్రజా రైతు సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షుడు పిట్టి రేణుకారెడ్డి డిమాండ్ చేశారు. సంఘం సభ్యులతో కలిసి ఆయన శుక్రవారం నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. బచావత్ ట్రిబ్యునల్ సూచనల మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 11 ప్రాజెక్ట్‌ల నిర్మాణం చేపట్టి 811 టీఎంసీలను వినియోగించుకోవాల్సి ఉందన్నారు. అయితే రాష్ట్ర విభజన జరిగిన తర్వాత తెలంగాణ మాత్రం తెలివిగా వ్యవహరించిందన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, ట్రెజరర్ భీమేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు విజయ్‌బాబు, సంయుక్త కార్యదర్శి గంగినేని రాజేష్, కోటేశ్వరావు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల్లో లాటరల్ ఎంట్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) 2024 – 25 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో లాటరల్ ఎంట్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ హనుమారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూజీ నాలుగు సంవత్సరాల ఆనర్స్ లేదా నాలుగు సంవత్సరాల ఆనర్స్ విత్ రీసెర్చ్ కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులు పీజీ రెండో సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా చేరడానికి అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జెరాక్స్ కాపీలతో శనివారం నుంచి ఈ నెల 20 తేదీలోగా వర్సిటీ అడ్మిషన్స్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

వైరల్ ఫీవర్రీస్

ఇటీవల అల్లూరులో ఒక వ్యక్తికి ర్యాట్ బైట్ ఫీవర్ వచ్చింది. ఆయన సకాలంలో వైద్యులను సంప్రదించడంతో నగరంలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం కోలుకుంటున్నాడు. ఆయనకు నిర్వహించిన పలు రకాల పరీక్షలు, ఖరీదైన యాంటీబయాటిక్స్ మందులు వెరసి సుమారు ఇప్పటికే రూ.40 వేలు ఖర్చయినట్లు తెలుస్తోంది. ఈ ఫీవర్ వచ్చాక సకాలంలో గుర్తించలేక, తగిన వైద్యం పొందకపోతే ప్రాణాపాయమే.



కొండాపురం మండలం వెంకటరంగాపురం గ్రామానికి చెందిన చాంద్‌బీకి రెండు వారాలుగా జ్వరం వస్తోంది. కావలి పట్టణానికి వెళ్లి అక్కడ వైద్య పరీక్షలు చేయించుకుంది. రెండు రోజులు ఆస్పత్రిలో అడ్మిట్ అయి రూ.5 వేలు ఖర్చు పెట్టుకుని ఇంటికి వెళ్లింది. అయినా జ్వరం తగ్గకపోవడంతో ఆమె నెల్లూరులోని డాక్టర్ రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కు వచ్చింది. అక్కడ అన్ని రకాల పరీక్షలు చేయగా ఆమెకు స్క్రబ్ టైఫస్ అనే విషజ్వరం ఉన్నట్లు తేలింది. అప్పటికే ఆయాసంతో ఆమె బాధపడుతోంది. దీంతో ఆమెను ఆస్పత్రిలో చేర్చుకున్న డాక్టర్లు ఆమెకు ప్రాణవాయువు (ఆక్సిజన్) ఏర్పాటు చేసి రెండు రోజులు ఐసీయూలో చికిత్స అందించారు. ఆమెకు రూ.35 వేలు ఖర్చు అయింది. కోలుకోవడంతో ఆదివారం డిశ్చార్జి చేశారు.

జిల్లాలో ర్యాట్ ఫీవర్ కలకలం

- విజృంభిస్తోన్న లెప్టోస్పైరోసిస్, హంటావైరస్, లింఫోసైటిక్ మెనింజైటిస్
- ఎలుక ద్వారా వచ్చే జబ్బులే
- మరో వైపు వైరల్ ఫీవర్లతో ఆస్పత్రులన్నీ కిటకిట
- జ్వరాలను సీరియస్‌గా తీసుకోని వైద్యశాఖ



పెద్దాస్పత్రిలో ల్యాబ్ వద్ద కిటకిటలాడుతున్న రోగులు

నెల్లూరు (అర్బన్): జిల్లాలో ర్యాట్ ఫీవర్ కలకలం సృష్టిస్తోంది. ఒక ర్యాట్ ఫీవరే కాకుండా విష జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రైవేట్ ఆస్పత్రులన్నీ జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నప్పటికీ వైద్యారోగ్యశాఖ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. తాజాగా ఓ వ్యక్తి ర్యాట్ ఫీవర్‌తో ఆస్పత్రిలో చేరాడు. డెంగీ తర్వాత ర్యాట్ ఫీవర్ అత్యంత ప్రాణాంతకమైంది. ఎలుకల కాటు, నీటిలో, ఆహారంలో వాటి మలమూత్రాల కలుషితం వల్ల ర్యాట్‌బైట్ ఫీవర్‌తో పాటు లెప్టోస్పైరోసిస్, హంటావైరస్, లింఫోసైటిక్ మెనింజైటిస్ వంటి ఆరు ప్రమాదకర వైరస్‌లు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. ప్రధానంగా లెప్టోస్పైరోసిస్, స్క్రబ్ టైఫస్ విషజ్వరాలు బయటపడుతున్నాయి.

ర్యాట్ ఫీవర్ లక్షణాలు


ఎలుకల ద్వారా వచ్చే జబ్బుల్లో ప్రధానంగా జ్వరం, వణుకు, ఎర్రటి ర్యాష్, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు ప్రధానంగా ఉంటాయి. సాధారణ జ్వరం అని పొరపడి ఇంటి వద్దనే జ్వరం మాత్రలు వేసుకుంటూ కాలం వెళ్లదీస్తే ప్రాణాలకే ప్రమాదం పొంచి ఉంటుంది. ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరి శ్వాస భారంగా మారే అవకాశం ఉంది. జ్వరం ఐదు రోజులకు తగ్గకుండా ఉంటే ఎలుకల ద్వారా వచ్చే ర్యాట్ ఫీవర్, లెప్టోస్పైరోసిస్ వంటి పరీక్షలను చేయాలి. నల్లులు వల్ల వచ్చే స్క్రబ్ టైఫస్ పరీక్షలను చేయాలి.

కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

ప్రభుత్వ ఆధ్వర్యంలో జిల్లాలో 52 పీహెచ్‌సీలు, 10 సీహెచ్‌సీలు, ఒక జిల్లా ఆస్పత్రి, కావలి, కందుకూరులో ఏరియా ఆస్పత్రులు, నెల్లూరులో టీచింగ్ (సర్వజన) ఆస్పత్రి ఉన్నాయి. వీటితో పాటు 28 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిలో గత నెల వరకు రోజుకు 12 వేలు మంది రోగులు ఓపీ సేవలు పొందేవారు. ఇప్పుడు ఆ సంఖ్య దాదాపు 18 వేలుకు చేరింది. నెల్లూరులోని సర్వజన ఆస్పత్రిలోనే ఓపీ దాదాపు 1500కి చేరింది. ఓపీ సేవలను పరిశీలిస్తే ఎక్కువగా విషజ్వరాలే కనిపిస్తున్నాయి. ఇక 350 ప్రైవేట్ ఆస్పత్రుల్లో సైతం జ్వర పీడితులు ఎక్కువగా ఉన్నారు. అయితే జిల్లాలో వైద్యశాఖ మాత్రం చోద్యం చూస్తోంది. జ్వరాల నియంత్రణకు సర్వేలు చేపట్టలేదు. మెడికల్ క్యాంపులు నిర్వహించడం లేదు. ప్రజలను జ్వరాల నియంత్రణపై అప్రమత్తం చేయడంలేదు. నివారణపై అవగాహన కల్పించడంలేదు.

జ్వరాల లెక్కల్లేవు

వైద్యశాఖలో ఏ జ్వరాలకు సంబంధించి లెక్కలే లేవు. జిల్లా వైద్యాధికారులను ప్రత్యేకించిన కేసులను గుర్తించి అడిగితే.. ఒకటీ అర అంటూ కొట్టిపారేస్తున్నారు. ఇక డెంగీతో పాటు మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతో పాటు ర్యాట్ బైట్ ఫీవర్, లెప్టోస్పైరోసిస్ వంటి జబ్బుల లెక్కలు లేవు. అసలు లెక్కలే తీయడం లేదు. ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలను వివరాలు అడిగితే వైద్యశాఖ వారు ఇవ్వొద్దని చెబుతుందంటున్నారు.



ఎలుకల ద్వారా మనుషులకు..

ఎలుకల లాలాజలం, ఇతర భాగాల్లో ర్యాట్ ఫీవర్, లెప్టోస్పైరోసిస్ జబ్బులను కలిగించే బాక్టీరియా ఉంటుంది. ఎలుకలు మనిషిని గీకినా, కరిచినా వాటి ద్వారా ర్యాట్ ఫీవర్ వచ్చే అవకాశం ఉంది. చేపల, రొయ్యల చెరువుల్లో, ఇతర నీటి ఆవాసాల్లో ఎలుకలు విసర్జించిన మలమూత్రాలను గాయాలు ఉన్న వ్యక్తులు ఆ నీటిలో దిగితే ఈ జబ్బులు అంటుకుంటాయి.

ప్రజలే జాగ్రత్తలు తీసుకోవాలి



సీజనల్ విషజ్వరాలు ప్రబలుతున్నాయి. అయితే ప్రజలు భయపడాల్సిన పని లేదు. కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. జ్వరాలు వచ్చినప్పుడు సొంత వైద్యం చేయించుకోవద్దు. మూడు, నాలుగు రోజులకు మించి జ్వరం వస్తుంటే దగ్గరలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ప్రాథమిక పరీక్షలు చేయించుకుంటే ఏ జ్వరమో తెలుస్తోంది. జ్వరాన్ని బట్టి డాక్టర్ ట్రీట్‌మెంట్ చేస్తారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించడం, కలుషితం కాని నీరు, ఆహారం తీసుకోవడం ద్వారా నూటికి 80 శాతం జబ్బులను రాకుండా నివారించుకోవచ్చు.
– డాక్టర్ శ్రీనునాయక్, పీపీసీ, నెల్లూరు

ఒక్కరికే ర్యాట్ ఫీవర్



జిల్లాలో అల్లూరులో ఒక్కటే ర్యాట్ ఫీవర్ కేసు నమోదైంది. ఆ వ్యక్తి కోలుకున్నాడు. లెప్టోస్పైరోసిస్ వంటి కేసులు ఎలుకలతో పాటు ఇతర జంతువుల ద్వారా రావచ్చు. జిల్లాలో జ్వరాలు నియంత్రణలోనే ఉన్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నాం.
– డాక్టర్ పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ

వీఎస్‌ఎస్‌ల్లో అటవీ శాఖ తనిఖీలు



కనియంపాడు వీఎస్‌ఎస్‌లో జరుగుతున్న పనులు పరిశీలించిన స్క్వాడ్ అధికారులు

వరికుంటపాడు: మండలంలోని కనియంపాడు, విరువూరు వీఎస్‌ఎస్‌ల పరిధిలో అటవీ అధికారులు చేపట్టిన ప్లాంటేషన్‌ను శుక్రవారం జిల్లా స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. రెండ్రోజుల క్రితం సాక్షిలో 'వీఎస్‌ఎస్‌ల పేరుతో దోపిడీ' శీర్షికతో కథనం వెలువడిన నేపథ్యంలో అధికారులు ఆ ప్లాంటేషన్లను తనిఖీ చేసి నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం కావలి సబ్ డీఎఫ్‌ఓ రాజశేఖరబాబు ఆ ప్లాంటేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వీఎస్‌ఎస్‌లకు చెందిన పలువురు సభ్యులు తమ ప్రమేయం లేకుండానే ప్లాంటేషన్ చేపడుతున్నట్లు ఆయన దృష్టికి తెచ్చారు. శుక్రవారం కూడా జిల్లా స్క్వాడ్ అధికారులు విరువూరు, కనియంపాడు ప్లాంటేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్లాంటేషన్లలో చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. ప్లాంటేషన్లలో జరిగిన అవకతవకల గురించి విలేకరులు ప్రశ్నించగా పూర్తి సమాధానం చెప్పకుండానే దాటవేశారు. గుంటూరుకు చెందిన సీసీఎఫ్ స్క్వాడ్ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపితే వాస్తవాలు వెలుగు చూస్తాయని ఆయా వీఎస్‌ఎస్‌ల సభ్యులు చెబుతున్నారు.

కూటమి ప్రభుత్వం నిర్వాకం

- సంగం బ్యారేజీకి గౌతమ్‌రెడ్డి పేరు తొలగింపు



సంగం: మండల కేంద్రంలోని సంగం బ్యారేజీకు దివంగత మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరును శుక్రవారం తొలగించారు. దీనిపై అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఈ బ్యారేజీకి గౌతమ్‌రెడ్డి పేరును పెట్టారు. దీనిని అప్పట్లో ప్రతిపక్ష నాయకులు సైతం స్వాగతించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ పేరును తొలగించడంపై అన్నదాతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన సీసీల బదిలీల ప్రక్రియ

- పైరవీలకే పెద్దపీట



డీఆర్‌డీఏలో బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో అధికార పార్టీ నేతలు తాము చెప్పిన వారిని చెప్పిన చోట నియమించుకునేలా చేసుకున్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో ప్రాజెక్ట్ అధికారి కె.సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో కమ్యూనిటీ కో ఆర్డినేటర్లకు బదిలీల ప్రక్రియ నిర్వహించారు. మొత్తం 105 మంది కమ్యూనిటీ కో ఆర్డినేటర్లకు బదిలీల ప్రక్రియ నిర్వహించగా అందులో 71 మందికి ఐదేళ్లు నిండిన వారు కాగా, 34 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఉన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలతో బదిలీ ప్రక్రియ కొనసాగింది. ఎమ్మెల్యేలు తమకు అనుకూలమైన వారిని కావాల్సిన చోట నియమించుకునేలా సిఫార్సు చేశారు. పేరుకే ప్రభుత్వ ఉత్తర్వులు అయినా అధికార పార్టీ చెప్పినట్లుగానే బదిలీల ప్రక్రియ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ రాజు, డీపీఎంలు రవికుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలు



కౌన్సెలింగ్‌కు హాజరైన వార్డు సచివాలయాల కార్యదర్శులు

నెల్లూరు (బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వార్డు సచివాలయ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ శుక్రవారం స్థానిక కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించారు. కమిషనర్ సూర్యతేజ మౌఖిక ఆదేశాల మేరకు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు సమక్షంలో ఈ బదిలీల ప్రక్రియ జరిగింది. నెల్లూరు నగర పాలక సంస్థతో పాటు గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, ఆత్మకూరు మున్సిపాల్టీల్లో విధులు నిర్వర్తిస్తున్న మొత్తం 72 మంది ఉద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే కౌన్సెలింగ్‌కు 53 మంది మాత్రమే హాజరయ్యారు. వీరి దరఖాస్తులను పరిశీలించిన అధికారులు వారు కోరిన ప్రదేశాల్లో అక్కడున్న ఖాళీలను బట్టి కేటాయించి నివేదికలను మున్సిపల్ రీజనల్ డైరెక్టర్‌కు పంపించారు. బదిలీల ప్రక్రియలో ఆయా మున్సిపాలిటీలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

వేదగిరికి హుండీల రాబడి రూ.12.97 లక్షలు



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

నెల్లూరు సిటీ: మండలంలోని నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో దేవదాయశాఖ అధికారులు శుక్రవారం హుండీ లెక్కింపును చేపట్టారు. 110 రోజులకు హుండీల ద్వారా రూ.12,69,360, అన్నదానం హుండీ ద్వారా రూ.28,207, మొత్తం రూ.12,97,587 లక్షలు కానుక రూపంలో వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. సుధీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, రిటైర్డ్ బ్యాంకు సిబ్బంది, జొన్నవాడ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ నుంచి అంతర్జాతీయ స్థాయికి..



చిత్తూరులో జరిగిన ఖోఖో పోటీల్లో సిల్వర్ మెడల్ అందుకుంటూ.. (ఫైల్)



ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపుతూ.. (ఫైల్)

- అబ్బుర పరిచిన మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ విద్యార్థిని
- ఆట్యా–పాట్యాలో అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక
- ఖోఖో, అథ్లెటిక్స్, సాఫ్ట్‌బాల్ క్రీడల్లో సైతం ప్రతిభ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ బీవీఎస్ బాలికల హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని సౌత్ ఏషియన్ ఆట్యా–పాట్యా పోటీలకు భారత్ జట్టుకు ఎంపికైంది. చదువులతో పాటు క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనబరుస్తోంది. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రతిభను ఎవరూ ఆపలేరని రుజువు చేసింది. కార్పొరేషన్ పాఠశాల నుంచి మొట్టమొదటిసారిగా అంతర్జాతీయ స్థాయికి నెల్లూరు విద్యార్థిని ఎదగడం గర్వకారణం. పూజిత తల్లిదండ్రులు తుమ్మల వెంకటసుబ్బయ్య, సుప్రియ. వీరిది మర్రిపాడు మండలం తిక్కవరం గ్రామం. తమ ఇద్దరి పిల్లలతో బతుకు దెరువు కోసం నెల్లూరు నగరం చేరుకున్నారు. జాకీర్ హుస్సేన్ నగర్‌లో చిన్న కిరాణా కొట్టు ప్రారంభించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూనే పిల్లలను మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్లో చేర్పారు. పూజిత 6వ తరగతిలో బీవీఎస్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో చేరింది. అప్పటి నుంచి బాగా చదువుతూనే క్రీడలపై మక్కువ పెంచుకుంది. క్రీడల పట్ల ఆ అమ్మాయికి ఉన్న ఆసక్తిని ఉపాధ్యాయులు గుర్తించారు. తండ్రి వెంకట సుబ్బయ్య ప్రోత్సహించడంతో ఉపాధ్యాయులు ఆటల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. దీంతో పూజిత ఖోఖో, అథ్లెటిక్స్, సాఫ్ట్‌బాల్, ఆట్యా–పాట్యా క్రీడలను ఆడడం మొదలు పెట్టింది. స్కూల్ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిలకు ఎదిగింది. గతేడాది ఆట్యా– పాట్యాలో జాతీయ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభను కనపరిచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ంది. భూటాన్ దేశంలో 8వ సౌత్ ఏషియన్ ఆట్యా–పాట్యా ఛాంపియన్ షిప్ పోటీల్లో భారతదేశం జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగి అందరినీ అబ్బుర పరిచింది.

పూజిత సాధించిన పతకాలు


- 2022లో నెల్లూరులో జరిగిన ఆట్యా–పాట్యా రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం
- 2023లో కేరళలో జరిగిన జాతీయ స్థాయి జూనియర్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం
- 2023లో పాండిచ్చేరిలో జరిగిన జాతీయ స్థాయి సీనియర్ ఆట్యా–పాట్యా ఛాంపియన్‌షిప్ పోటీలకు రాష్ట్ర జట్టు తరుపున ప్రాతినిధ్యం
- ఈ పోటీల నుంచి అంతర్జాతీయ పోటీలకు భారత్ జట్టుకు ఎంపిక
- ఈ పోటీల నుంచి భూటాన్‌లో జరిగే 8వ సౌత్ ఏషియన్ ఆట్యా–పాట్యా ఛాంపియన్‌షిప్ పోటీల్లో భారత జట్టుకు ఎంపిక.
- 2023లో గుంటూరులో స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయిలో 4వ స్థానం
- 2023లో కాకినాడలో జరిగిన స్కూల్‌గేమ్స్ ఖోఖో పోటీల్లో సిల్వర్ మెడల్
- 2023లో అండర్–19 చిత్తూరులో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ ఖోఖో పోటీల్లో బ్రాంజ్ మెడల్.

క్రీడలను ప్రోత్సహిస్తాం



పాఠశాలలో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులే ఉంటారు. చదువుల్లో, క్రీడల్లో రాణించే విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక సహాయ సహకారాలను అందిస్తాం. పూజితకు పాఠశాల తరఫున కొన్ని స్వచ్ఛంద సంస్థల తరఫున ఆర్థిక సాయం అందించాం. దీంతో ఆ అమ్మాయి టోర్నమెంట్లకు వెళ్లడం అక్కడ క్రీడా ప్రతిభను పెంచుకోవడం అలవర్చుకుంది. నేడు ఈ స్థాయికి ఎదిగింది. మా పాఠశాలకు బెస్ట్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ ఇన్ స్పోర్ట్స్ అవార్డు –2024 రావడం అభినందనీయం.
– పి.విజయజ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు

క్రీడా ప్రతిభను మెరుగు పరుచుకుంది



పాఠశాలలో చేరినప్పటి నుంచి పూజిత చదువుల్లోనూ, క్రీడల్లోనూ తన ప్రతిభను మెరుగు పరుచుకుంటూ వచ్చింది. ఖోఖో, అథ్లెటిక్స్, సాఫ్ట్‌బాల్, ఆట్యా–పాట్యా క్రీడల్లో ఐదుసార్లు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పలు పతకాలను సాధించింది. ఈ అంతర్జాతీయ పోటీలకు ఎంపికవడంతో ఒక కొత్త రికార్డును నెలకొల్పింది.
– అజయ్, వ్యాయామ ఉపాధ్యాయుడు

దేశం పేరు నిలబెడతా



చదువుల్లో, క్రీడల్లో రాణించడం ఎంతో సంతోషంగా ఉంది. నేను ఈ స్థాయికి రావడానికి ఎంతో మంది సహాయాన్ని అందించారు. ప్రోత్సహించారు. అంతర్జాతీయ స్థాయిలో నెల్లూరు పేరును తద్వారా దేశం పేరును నిలబెడతాను. బాగా చదివి స్పోర్ట్స్ కోటాలో సెంట్రల్ గవర్నమెంట్‌లో ఉన్నత ఉద్యోగం సాధిస్తాను.
– టి.పూజిత, అంతర్జాతీయ ఆట్యా–పాట్యా క్రీడాకారిణి

ట్రాక్ నిర్మాణంలో నిలువెల్లా నిర్లక్ష్యం

ముందుకు కదలని ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్ నిర్మాణ పనులు
- గత ప్రభుత్వంలో రూ.1.23 కోట్ల మంజూరు
- ఆ బాధ్యతలు ఆర్అండ్బీకి అప్పగింత
- అప్పట్లోనే సెన్సార్, వీడియో కెమెరాల చేరవేత
- రవాణా కార్యాలయంలో వృథాగా పరికరాలు

రవాణా శాఖలో డ్రైవింగ్ లైసెన్స్లను పారదర్శకంగా జారీ చేయాలని గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఆలోచన చేసింది. ఇందులో భాగంగా ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్లను పలు జిల్లాలకు మంజూరు చేసింది. మన జిల్లాలో దీని నిర్మాణం నత్తనడక సాగుతోంది. అన్ని రకాల పరికరాలను అప్పట్లోనే పంపినా కాంట్రాక్ట్ సంస్థ నిర్లక్ష్య వైఖరి కారణంగా ఇంకా అందుబాటులోకి రాలేదు.


చిత్తూరులో నిర్మించిన ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్

నెల్లూరు(టౌన్): డ్రైవింగ్ లైసెన్స్ల జారీలో పైరవీలు, మధ్యవర్తులకు తావులేకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సర్టిఫికెట్ను జారీ చేసేందుకు గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా వాటిని నిర్మించాలని నిర్ణయించింది. ఇప్పటికే ఇవి చిత్తూరు, నంద్యాల తదితర జిల్లాల్లో ఉన్నాయి. మన జిల్లాలో నిర్మాణ పనులను ఆర్అండ్బీ అధికారులకు అప్పగించారు. అవసరమైన పరికరాల ఏర్పాటు బాధ్యతలను నిపుణ్ నెట్ సొల్యూషన్ సంస్థకు ఇచ్చారు. అప్పట్లోనే సర్కారు రూ.1.23 కోట్లు నిధులు మంజూరు చేసింది. సీసీ కెమెరాలు, వీడియో కెమెరాలు, సెన్సార్లు, కంప్యూటర్లు తదితర వాటికి రూ.కోటి ఖర్చు చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న ట్రాక్ను చదును చేసేందుకు మరో రూ.23 లక్షలు కేటాయించి ఆ పనులను ఆర్అండ్బీకి అధికారులకు అప్పగించారు. ద్విచక్ర, లైట్ మోటార్, హెవీ మోటారు వాహనాలను డ్రైవింగ్ చేసే విధంగా డ్రైవింగ్ ట్రాక్ను సిద్ధం చేయాల్సి ఉంది. అందులో 8, హెచ్, అప్గ్రేడ్మెంట్, పార్లర్ పార్కింగ్ తదితర ఆకారాల్లో నిర్మాణాలు చేయాలి.

ఇదే ప్రధాన కారణం

సాధారణంగా లైసెన్స్ల జారీలో మధ్యవర్తుల ప్రమేయం ఎక్కువగా ఉంటుంది. అదే ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ అమల్లోకి వస్తే మానవ ప్రమేయం లేకుండా పారదర్శకంగా లైసెన్స్ల జారీ జరుగుతుంది. దీని కారణంగా ప్రమాదాల సంఖ్య భారీగా తగ్గే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ట్రాక్లో సాంకేతిక పరికరాల ఏర్పాటు విషయంలో నిర్వాహకులు నిర్లక్ష్య ధోరణి చూపుతున్నారు. వీడియో కెమెరాలు, సెన్సార్లు, అవసరమైన సామగ్రి గతేడాది మార్చిలోనే జిల్లా రవాణా కార్యాలయానికి చేర్చినా వాటిని అలాగే వదిలేశారు. వాటిని ఎవరైనా ఎత్తుకెళ్తారనే భయంలో రవాణా అధికారులున్నారు. ఎక్కువ రోజులు వినియోగంలో లేకున్నా పాడయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఇనుముతో కూడిన వస్తువులను బయట పడేయడంతో వర్షానికి తడిచి తప్పు పడుతున్నాయి.


వృథాగా పడేసిన సామగ్రి

నాసిరకంగా పనులు

ట్రాక్ నిర్మాణ బాధ్యతలను ఆర్అండ్బీ అధికారులకు అప్పగించగా వారికి అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్ చేత పనులు చేయించినట్లు ఆరోపణలున్నాయి. చిన్నపాటి వర్షానికే ట్రాక్లో నీళ్ల నిలబడి లేయర్లు కొట్టుకుపోయినట్లు రవాణా శాఖ అధికారులే పేర్కొంటున్నారు. రోడ్డు ఎగుడుదిగుడుగా తయారైనట్లు తెలిసింది. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు ఉండటం వల్లే ఈ పరిస్థితి తలెత్తినట్లు చెబుతున్నారు. దీనికి సంబంధించి నగదు చేతులు మారాయని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం అనేకమందిలో ఉంది.

ఎలా అంటే..

కొత్త ట్రాక్లో ప్రతి పది అడుగులకు ఒక సెన్సార్ ఉంటుంది. పోల్స్ను ఉంచి వాటికి 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. డ్రైవింగ్ చేసే వాహనంలో ఒక సీసీ కెమెరాను బిగిస్తారు. వీటితోపాటు రేడియో ఫ్రీక్వెన్సీ, నాయిస్ ఐడెంటిఫికేషన్, సెన్సార్లను ఏర్పాటు చేస్తారు. ఈ మొత్తాన్ని 15 కంప్యూటర్లకు అనుసంధానం చేస్తారు. లైసెన్స్ దరఖాస్తుదారులు డ్రైవింగ్ చేసే విధానాన్ని వీడియో కెమెరాలు రికార్డింగ్ చేస్తాయి. దీనిని కంట్రోల్ రూమ్ నుంచి రవాణా శాఖ అధికారులు పర్యవేక్షిస్తారు. నిబంధనలు పాటించకుంటే ఆటోమేటిక్గా ఫెయిల్ అయినట్లు మెసేజ్ వస్తుంది. అంతా సక్రమంగా ఉంటే పాస్ అని చూపిస్తుంది. ఈ రీతిలో రోజుకు వంద లైసెన్స్లు ఇచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.


డ్రైవింగ్ ట్రాక్లో పిచ్చి మొక్కలు

ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశాలొచ్చాయి

ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ నిర్మాణాన్ని ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర రవాణా అధికారులు డెడ్లైన్ విధించారు. ఈ విషయాన్ని సదరు సంస్థ ప్రతినిధులకు తెలియజేశాం. త్వరలో పిచ్చిమొక్కలను తొలగించి సీసీ కెమెరాలు, కంప్యూటర్లు, సెన్సార్లు తదితర వాటిని బిగించి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం. పారదర్శకంగా డ్రైవింగ్ లైసెన్స్లను అందించాలన్నదే మా లక్ష్యం.
– బి.చందర్, డీటీసీ


గదిలో మూలన పడేసిన సీసీ కెమెరాలు, సెన్సార్లు, కంప్యూటర్లు

క్లుప్తంగా

సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఎస్పీ కృష్ణకాంత్


సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీస్స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 36 మంది సిబ్బంది ట్రాన్స్ఫర్లు, ఆరోగ్య భద్రత, లోన్లు, సస్పెన్షన్ తొలగింపు తదితర సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమంలో భాగంగా ప్రతి శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహిస్తున్నామన్నారు. సిబ్బంది అపరిష్కృతంగా ఉన్న సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మైనర్ బాలలకు విముక్తి

- 11 మందిని బాలల సంరక్షణకు తరలింపు


పోలీసు రక్షణలో బాలలు

నెల్లూరు(క్రైమ్): 11 మంది మైనర్ బాలలను రైల్లో ఒడిశా నుంచి చెన్నైకి అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న బాలల సంరక్షణ అధికారి శుక్రవారం రైల్వే పోలీసులతో కలిసి దాడులు చేసి వారికి విముక్తి కల్పించారు. ఒడిశాలోని రాయగఢ్ నుంచి టాటానగర్ రైల్లో బాలలను చెన్నైకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో నెల్లూరు రైల్వేస్టేషన్లో ఆర్పీఎఫ్ సహకారంతో రైలు ఆపి తనిఖీలు చేశారు. దీంతో 11 మంది మైనర్ బాలలను గుర్తించారు. వీరిని చెన్నైలోని సెంట్రింగ్ పని చేయించుకునేందుకు తీసుకెళ్తున్నారు. ఐదుగురిని పోలీసు హోంకు, ఆరుగురిని చిన్నారుల హోంలో చేర్పించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్, ఏహెచ్టీయూ సిబ్బంది శ్రీహరి, సతీష్, ప్రసాద్, బీబీఏ సిబ్బంది తిరుమలరావు, చంద్రశేఖర్, ఐసీడీఎస్ సిబ్బంది రత్నం, పావని, సమత తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి.. అధికారుల ఆరా

- ఎస్పీకి వినతిపత్రం ఇచ్చిన బాధిత కుటుంబసభ్యులు
- సోమిరెడ్డికి ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమని ఆవేదన


మాట్లాడుతున్న బాధితుల కుటుంబసభ్యులు

వెంకటాచలం: సర్వేపల్లి నియోజకవర్గంలో వెంకటాచలం, ముత్తుకూరు పోలీస్స్టేషన్లలో దళితులను చితకబాదిన ఘటనపై పోలీస్ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. ముత్తుకూరు గ్రామానికి చెందిన హరీష్, చక్రవర్తితోపాటు మరో నలుగురిని ముత్తుకూరు, వెంకటాచలం పోలీస్స్టేషన్లలో పోలీసులు లాఠీలతో కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి శుక్రవారం పత్రికలు, మీడియాలో విస్తృతంగా వార్తలు రావడంతో పోలీస్ ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు సమాచారం. ఇరువర్గాల మధ్య గొడవ జరిగితే పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించి దళితులను రెండు స్టేషన్లలో చితకబాదారని బాధితుల తల్లిదండ్రులు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో వాస్తవాలపై ఆరా తీస్తున్నారు. ముత్తుకూరులో ఎప్పుడు అదుపులోకి తీసుకున్నారు?, అక్కడి నుంచి వెంకటాచలం స్టేషన్కు ఎప్పుడు తీసుకొచ్చారు?, రెండు స్టేషన్లలో లాఠీలతో చితకబాదడం వాస్తవమేనా?, ఇందులో రాజకీయ ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయాననే కోణంలో విచారణ చేస్తున్నారు.

టీడీపీ హయాంలో రక్షణ కొరవడింది

నెల్లూరు(క్రైమ్): 'దళితులపై దాడి విషయాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో దళితులకు రక్షణ కొరవడింది' అని బాధిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. ముత్తుకూరు ఎస్సై విశ్వనాథ్రెడ్డి, కానిస్టేబుల్ సుమన్పై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు, బాధిత యువకుల కుటుంబసభ్యులు పోలీసు ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యుడు రఘు తదితరులు శుక్రవారం నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.కృష్ణకాంత్కు వినతిపత్రం సమర్పించారు. ఘటనకు దారి తీసిన పరిస్థితులను వివరించి సదరు పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు జిల్లా పోలీసు కార్యాలయం బయట మాట్లాడారు. ఎస్సై, కానిస్టేబుల్పై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోవూరు: మోటార్బైక్ అదుపుతప్పి డివైడర్ను ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందిన ఘటన శుక్రవారం కోవూరు షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పోతిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఇండ్ల వెంకటసుబ్బయ్య (19), శివశంకర్ కలిసి ఓ ఫ్రెండ్ పుట్టినరోజు వేడుకల కోసం బైక్పై బయలుదేరారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో బైక్ అదుపుతప్పి డివైడర్ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటసుబ్బయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంగనాథ్గౌడ్ తెలిపారు.

22 నుంచి పోలేరమ్మ జాతర

- మంత్రి ఆనం వెల్లడి


వాల్పోస్టర్ను ఆవిష్కరించిన మంత్రి ఆనం

నెల్లూరు(దర్గామిట్ట): ఈనెల 22వ తేదీ నుంచి వెంకటగిరి గ్రామదేవత పోలేరమ్మ జాతర జరుగుతుందని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. జాతరకు సంబంధించిన కరపత్రాలు, వాల్పోస్టర్లను నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో మంత్రి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతరను 22 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించడానికి కమిటీ ఏర్పాట్లు చేస్తోందన్నారు. రూ.కోటి నిధులను మంజూరు చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సంవత్సరం పోలేరమ్మకు స్వర్ణ పాదాలు చేయించడానికి కమిటీ నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నెల్లూరు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి శ్రీనివాస రెడ్డి, నూతన ధర్మకర్తలు పాల్గొన్నారు.

'పెద్దాస్పత్రిలో డయాలసిస్ కేంద్రం తెరిచారు'


డయాలసిస్ సేవలు ప్రారంభించిన హెచ్ఓడీ డాక్టర్ నరేంద్ర తదితరులు

నెల్లూరు(అర్బన్): దాతల సహకారంతో నెల్లూరు దర్గామిట్టలోని పెద్దాస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని ఎట్టకేలకు ప్రారంభించారు. శుక్రవారం సాక్షిలో 'మూసేశారు అమాత్యా..!' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సహకారంతో నెల క్రితమే రూ.80 లక్షలు ఖర్చు చేసి దాతలు బయ్యా సరోజనమ్మ – లయన్స్క్లబ్ పేరుతో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించినా వినియోగంలోకి తీసుకురాలేదని, అందువల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వైనాన్ని కథనంలో వివరించడం జరిగింది. దీంతో స్పందించిన సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ సెలవులో ఉన్నా జనరల్ మెడిసిన్ డాక్టర్లను అప్రమత్తం చేసి ఆగమేఘాల మీద ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం ఇద్దరు రోగులను చేర్చుకుని కేంద్రాన్ని వినియోగంలోకి తెచ్చారు. జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ, ప్రొఫెసర్ డా.నరేంద్ర మాట్లాడుతూ ఆధునిక వసతులతో డయాలసిస్ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చామని రోగులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

నిమ్మ ధరలు (కిలో)	
పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు			
బ్రాయిలర్ (లైవ్)	: 131	బ్రాయిలర్ స్కిన్లెస్	: 260
లేయర్ (లైవ్)	: 108		
బ్రాయిలర్ చికెన్	: 236	లేయర్ చికెన్	: 184